సాక్షి
వరంగల్
శుక్రవారం | 14 | మార్చి | 2025



నిధులు హాంఫట్!

కాకతీయ యూనివర్సిటీ విద్యా కళాశాలలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని కొంతకాలంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. - 8లో



టెక్నాలజీతో మార్పులు..

టెక్నాలజీతో మార్పులు అనివార్యమని, టెక్నాలజీని స్వాగతించినప్పుడే వ్యాపార సంస్థల మనుగడ సాధ్యమని కేయూ మాజీ వీసీ బి. వెంకటరత్నం అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
40^0 /22^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చలి ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం వేళ ఆహ్లాదంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

19లోగా సమావేశాలు నిర్వహించాలి



వరంగల్: ఓటరు జాబితా సవరణ, ఇతర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈనెల 19లోగా సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్, ఇతర వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఆయన సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 217 మంది గైర్హాజరు

కాశీబుగ్గ సెంటర్: జిల్లా వ్యాప్తంగా గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. 4,358 మంది జనరల్ విద్యార్థులకు 4,202 మంది, 818 మంది ఒకేషనల్ విద్యార్థులకు 757 మంది హాజరైనట్లు డీఈఐఓ డాక్టర్ శ్రీధర్‌సుమన్ తెలిపారు. మొత్తం 217 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

కొమ్మాల జాతర కమిటీ చైర్మన్‌గా కడారి రాజు



గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర కమిటీ చైర్మన్‌గా కొమ్మాల గ్రామానికి చెందిన కడారి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉత్సవ కమిటీలో 13 మంది సభ్యులను రాష్ట్ర దేవాదాయశాఖ వారు నియమించారు. గురువారం వారితో ప్రమాణ స్వీకారం చేయించగా.. కమిటీ చైర్మన్‌గా కడారి రాజును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయానికి వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్‌గా చక్రవర్తులు శ్రీనివాసాచార్యులు ఇప్పటికే వ్యవహరిస్తున్నారు. కమిటీ ఈనెల 20 వరకు మనుగడలో ఉంటుంది. సభ్యులుగా లావుడ్యా రాజన్న, కోల వేణు, కేలోత్ చైత్రం, మర్రి రాజలింగం, భూక్యా రాంబాబు, వాంకుడోత్ సెల్వ, లడే రాజేశ్వర్‌రావు, మండల నరేశ్, ఇమ్మడి సమ్మయ్య, బోయపాటి శ్రీదేవి, యారా రాజయ్య, నాగారపు సుమలత నియమితులయ్యారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, సభ్యులు తమను నియమించడానికి కృషి చేసిన పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నర్సంపేట: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. చెన్నారావుపేట మండలం ముగ్దుంపురం గ్రామంలో ఓ ఇంట్లో రూ.60 వేల విలువైన 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కొమ్ము శివ, కిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



వర్ధన్నపేట: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గౌతంరెడ్డి అన్నారు. ఉప్పరపల్లి సబ్‌స్టేషన్‌లోని టౌన్ ఫీడర్‌కు ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ఏ సమస్య రాకుండా చర్యలు తీసుకుని వినియోగదారులకు అసౌకర్యం కలుగకుండా చూస్తున్నామన్నారు. వరంగల్ రూరల్ డీఈ బి.భిక్షపతి, ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్, సబ్ ఇంజనీర్ ఎస్ శివ, ఎల్ఐ హరియా, ఎల్ఎ లక్ష్మణ్, అయిలయ్య, ప్రవీణ్, సుమన్, రమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



సైట్ ఫైట్



కార్పొరేషన్/మున్సిపాలిటీల వారీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు

మున్సిపాలిటీ	దరఖాస్తులు
గ్రేటర్ వరంగల్	1,00,989
పరకాల	3,182
నర్సంపేట	5,421
వర్ధన్నపేట	522
మహబూబాబాద్	12,201
డోర్నకల్	872
మరిపెడ	2,629
తొర్రూరు	10,299
భూపాలపల్లి	3,771
జనగామ	18,379

'ఎల్ఆర్ఎస్'కు ఆన్‌లైన్ కష్టాలు

- 25 శాతం మినహాయింపు ఈనెల 31 వరకే..
- సతాయిస్తున్న వెబ్‌సైట్.. వినియోగదారుల్లో ఆందోళన
- 1,58,265 దరఖాస్తులు.. 18,357 ఆమోదం
- వివిధ స్థాయిల్లో 1,39,908 అర్జీలు

సాక్షిప్రతినిధి, వరంగల్ : అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) బాలారిష్టాలు దాటడం లేదు. ఈ క్రమబద్ధీకరణకు 25 శాతం మినహాయింపును ఉపయోగించుకోవాలనుకునే వారికి అవాంతరాలు తప్పడం లేదు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తామనుకునే వారికి వెబ్‌సైట్ ఓపెన్‌కాక.. ఆన్‌లైన్ యాక్సెస్ లభించక.. మున్సిపల్ ఆఫీస్‌ల చుట్టూ తిరిగి పోతున్నారు. ఈ వెబ్‌సైట్ అప్‌డేషన్‌కు మరికొన్ని రోజులు పట్టేలా ఉంది. దీంతో వారం, 10 రోజుల తర్వాత రమ్మని సిబ్బంది దరఖాస్తుదారులకు చెబుతున్నారు. ఫోన్లు చేసి ఫీజు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవచ్చని చెప్పి.. తీరా ఆఫీస్‌కు వెళ్తే ఆన్‌లైన్ పని చేయట్లేదని చెప్పడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ తంతు ఇలాగే కొనసాగితే ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు ఇచ్చిన 25 శాతం రాయితీ డెడ్‌లైన్ ఉపయోగించుకోవడం ఎలా అని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

సాంకేతిక సమస్యలు ..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఉమ్మడి జిల్లా పరిధి 9 మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ కోసం 2020 సంవత్సరం 1,58,265 దరఖాస్తులు రాగా, పరిశీలన, ఆమోదం ఆగుతూ సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఆ దరఖాస్తుల్లో కదలిక రాగా.. మొత్తంగా 2024 వరకు 18,357 అప్లికేషన్లను పరిశీలించి ఆమోదించారు. ఇంకా 1,39,908 దరఖాస్తులు వివిధ స్థాయిల్లో ఉండగా.. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ మళ్లీ ట్రాక్‌లో పడింది. ఈనెల 31 వరకు ఎల్ఆర్ఎస్ చేసుకుంటే 25 శాతం మినహాయింపు కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో దరఖాస్తుదారులు ఒక్కసారిగా ముందుకు వచ్చారు. అయితే వెబ్‌సైట్ సరిగా ఓపెన్ కాక తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

మున్సిపాలిటీల్లో ఇదీ పరిస్థితి..

- గ్రేటర్ వరంగల్‌లో 1,00,989 దరఖాస్తులకు గురువారం 35,007 మంది దరఖాస్తుదారులకు ఫీజులు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలని అధికారులు సమాచారం ఇవ్వగా.. రూ.5.87 కోట్లు చెల్లించి 746 దరఖాస్తులు క్లియర్ చేసుకున్నారు. మిగతా దరఖాస్తులపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు.
- జనగామ మున్సిపాలిటీ నుంచి ఎల్ఆర్ఎస్ కోసం 18,379 దరఖాస్తులు రాగా.. 7,127 అప్లికేషన్లకు అధికారులు ఆమోదించారు. అందులో 64 మంది రూ.26 లక్షలు చెల్లించారు. మిగతావి ప్రాసెస్‌లో ఉన్నాయి.
- వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీలో 5,421 దరఖాస్తులుండగా 1,565 మందికి ఫీజు చెల్లించాలని అధికారులు సమాచారం ఇవ్వగా ఇప్పటి వరకు 81 మంది రూ.41 లక్షలు చెల్లించారు.
- వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మున్సిపాలిటీలో 522 దరఖాస్తులకు 187 ఆమోదించగా.. గురువారం నాటికి 13 మంది మాత్రమే ఫీజు చెల్లించగా రూ.6 లక్షల మేరకు ఆదాయం సమకూరింది.
- హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీలో 3,182 దరఖాస్తులకు 2,320 అప్లికేషన్లు ఆమోదించి సమాచారం ఇవ్వగా ఇప్పటి వరకు 16 డాక్యుమెంట్లపై రూ.5 లక్షల చెల్లింపులు మాత్రమే జరిగాయి.
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపాలిటీలో 872 దరఖాస్తులకు 652 ఓకే కాగా 25, మరిపెడ మున్సిపాలిటీలో 2,629 అప్లికేషన్లకు 1,278 ఆమోదించగా 29 మంది మాత్రమే రూ.11 లక్షలు చెల్లించారు. తొర్రూరు మున్సిపాలిటీలో 10,299 అప్లికేషన్లకు 4,722 ఆమోదించగా 71 మంది రూ.30 లక్షలు, మహబూబాబాద్ మున్సిపాలిటీలో 12,201 దరఖాస్తులకు 2,522 మంది ఫీజు చెల్లించాల్సి ఉండగా 447 మంది రూ.2.07 కోట్లు చెల్లించారు.
- భూపాలపల్లి మున్సిపాలిటీలో 3,771 అప్లికేషన్లకు 2,234 ఆమోదించగా 127 మంది రూ.61 లక్షలు చెల్లించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి..



ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సదుపాయాన్ని లేఅవుట్, నాన్ లేఅవుట్ ప్లాట్ల యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. సంబంధిత శాఖల అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు రెగ్యులరైజ్ చేసుకోవాలి.

- అశ్విని తానాజీ వాకడే
కమిషనర్, జీడబ్ల్యూఎంసీ

నేడు హోలీ

ఘనంగా కాముని దహనం

- ముగిసిన జాజిరి పాటల సందడి



వరంగల్ పిన్నావారి వీధిలో కాముడి దహనం

హన్మకొండ కల్చరల్: కాముని పున్నమిని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని పలు కూడళ్లలో కామదహనం నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కాముని మంటల చుట్టూ ఆడిపాడుతూ సందడి చేశారు. శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఈమేరకు గురువారం హోలీ సామగ్రి విక్రయాలతో జిల్లా కేంద్రం, నర్సంపేట, వర్ధన్నపేటతోపాటు మండల కేంద్రాలు రద్దీగా మారాయి.

49 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

- జిల్లాలో హాజరుకానున్న 9,737 మంది విద్యార్థులు
- 550 మంది ఇన్విజిలేటర్లు, 49 మంది సీఎస్‌లు, 50 మంది డీఓల నియామకం

కాశీబుగ్గ సెంటర్: పదో తరగతి వార్షిక పరీక్షలకు సమయం ఆసన్నమవుతోంది. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్న పరీక్షలకు జిల్లా నుంచి 9,737 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు 4,130 (బాలికలు 1,757, బాలురు 2,373) మంది, ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు 5,107 మంది (బాలికలు 2,677, బాలురు 2,430) ఉన్నారు. అధికారులు 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 550 మంది ఇన్విజిలేటర్లు, 49 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 50 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. గతంలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించారు. అంతేకాకుండా 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో నగదు అందజేశారు. కౌన్సెలింగ్, ఫోన్‌ఇన్ ప్రోగ్రాం నిర్వహించి విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టారు. ఈసారి ఎలాంటి చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకుండా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారని ఆరోపణలు ఉన్నాయి.

ఉత్తమ ఫలితాలు సాధించేనా ?

పరీక్షల సమయం ఆసన్నమవుతున్న కొద్దీ విద్యార్థులు కొంత ఆందోళనకు గురవుతారు. ప్రైవేట్ విద్యాసంస్థలు కౌన్సిలర్స్ ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తాయి. కానీ, ప్రభుత్వ పాఠశాలల్లో అలాంటి తరగతులు నిర్వహించ లేదు. గత సంవత్సరం రాష్ట్రంలో జిల్లా 22వ స్థానంలో నిలిచింది. ఈసారి ఫలితాలు ఎలా ఉంటాయో వేచిచూడాలి. పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై డీఈఓను కలిసేందుకు ప్రయత్నించగా నిరాకరించారు.

ఒత్తిడికి గురికావొద్దు..



పరీక్షల ముందు విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు. భయాందోళన వీడాలి. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. చదువుతోపాటు ఆరోగ్యమూ ముఖ్యమే. 8 గంటల నిద్ర అవసరం. ఏకాగ్రతగా చదవాలంటే బలవర్ధక ఆహారం తీసుకోవాలి. ధ్యానం చేస్తే మేలు. -బొజ్జ సురేశ్, సైకాలజిస్ట్

వలలో చిక్కుకొని మత్స్యకారుడి మృతి



వెంకన్న (ఫైల్)

రాయపర్తి: చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతిచెందిన సంఘటన మైలారం బతుకమ్మచెరువులో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మత్స్యకారుడు బాద వెంకన్న (39)తోపాటు మరో నలుగురు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లారు. ఈ క్రమంలో వలలో చిక్కుకొని అందులోనే వెంకన్న మృతిచెందాడు. చీకటి కావడంతో వెంకన్న ఇంటికి వెళ్లాడుకున్న తోటి మత్స్యకారులు ఇళ్లకు వెళ్లారు. ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు చెప్పడంతో హుటాహుటిన వారు అక్కడికి వెళ్లి చూసేసరికి వెంకన్న మృతదేహం చెరువులో తేలియాడుతూ కనిపించింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



విద్యార్థులకు కంటి అద్దాలు అందజేసి మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: పాఠశాలల్లోని 333 మంది విద్యార్థినీవిద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలను అందజేస్తోందని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రాత్రి విద్యార్థులకు ఆమె కంటి అద్దాలను పంపిణీ చేసి మాట్లాడారు. కంటి వ్యాధుల నివారణకు విద్యార్థులు సమీకృత ఆహారం తీసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి నాగేశ్వరరావు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ప్రతాపగిరి ప్రసాద్, రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ హోలీ శుభాకాంక్షలు

కలెక్టర్ డాక్టర్ సత్యశారద జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాగద్వేషాలకు అతీతంగా అందరిని ఒక్కచోట చేర్చే ఈ హోలీ వేడుక ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సహజ రంగులను ఉపయోగించి ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'ఏఐ' బోధన

- విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

వరంగల్: రాష్ట్రంలోని 6 జిల్లాల ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ని ఉపయోగించి విద్యాశాఖ బోధన ప్రారంభించిందని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. హైదరాబాద్ నుంచి గురువారం ఆమె కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డితో కలిసి కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు, ప్రోగ్రాం, క్వాలిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిగిలిన అన్ని జిల్లాల్లో కూడా ఈనెల 15న ఏఐ బోధన ప్రారంభించాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ ఎంపిక చేసిన 11 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖాధికారులకు ఒకరోజు ఓరియంటేషన్ నిర్వహించినట్లు తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని లింగాపురం ఎంపీపీఎస్, జల్లి ఎంపీపీఎస్, పాపయ్యపేట ఎంపీపీఎస్, గీసుకొండ మండలం మచ్చాపూర్ ఎంపీపీఎస్, నర్సంపేట మండలం మహేశ్వరం ఎంపీపీఎస్, పర్వతగిరి మండలం గోపనపల్లి ఎంపీపీఎస్, రాయపర్తి మండలం మైలారం, కొలన్‌పల్లి, ఊకల్, తిరుమలాయపల్లి, కాట్రేపల్లి ఎంపీపీఎస్‌లో బోధన ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, డీఈఓ జ్ఞానేశ్వర్, సుజన్‌తేజ, క్వాలిటీ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు పాముకాటు

- బాధితుడిని పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించిన ఎస్సై మహేందర్



రైతు బాలాజీని పోలీసు వాహనంలో ఎక్కిస్తున్న ఎస్సై మహేందర్

నెక్కొండ: రైతు పాముకాటుకు గురైన సంఘటన బొల్లికొండలో గురువారం జరిగింది. మాజీ సర్పంచ్ బానోత్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ బాలాజీ ఎస్సారెస్పీ కెనాల్ నీటిని వరి పంటకు పారించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో చెట్లపొదలు తొలుస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. దీంతో మాజీ సర్పంచ్ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లాడు. ఆయన తన ద్విచక్ర వాహనంపై బాలాజీని తీసుకెళ్తూ ఎస్సై మహేందర్‌కు సమాచారం అందించారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్ రోడ్డుకు చేరుకోగానే పోలీసు వాహనంలో బాధితుడిని చికిత్స కోసం ఎస్సై తరలించారు. నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయని శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్‌ను స్థానికులు అభినందించారు.

2,77,650 ఎకరాలు

- జిల్లాలో తేలిన సాగుభూముల లెక్క
- క్షేత్రస్థాయిలో అధికారుల సర్వే పూర్తి
- యాసంగిలో రూ.140,07,45,389 రైతు భరోసా
- ప్రభుత్వానికి నివేదిక అందజేత



సర్వే చేస్తున్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులు (ఫైల్)

ఖానాపురం: పంటల సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం అందిస్తోంది. ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. సాగులో ఉన్న భూములకే రైతు భరోసా అందిస్తామని, సాగుకు యోగ్యంగా లేని భూములకు నిలిపివేస్తామని ప్రకటించింది. ఇందుకోసం ఇప్పటికే అధికారులతో క్షేత్రస్థాయి సర్వేలు పూర్తి చేయించింది. ధాన్యాగార కేంద్రంగా వరంగల్ జిల్లా గుర్తింపు పొందింది. జిల్లా వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పంటలను సాగు చేస్తారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ద్వారా రైతులు పట్టాపాస్ బుక్‌లు పొందారు. పాస్‌బుక్‌లు పొందని రైతులు కూడా పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాగుకు యోగ్యంగా లేని భూములకు కూడా పాస్ బుక్‌లు ఉన్నాయి. ఇవేమీ పట్టించుకోకుండా గత ప్రభుత్వం రైతు బంధు ద్వారా పెట్టుబడి సాయం అందజేసింది. సాగుకు యోగ్యంగా లేని భూములకు పెట్టుబడి సాయం నిలిపివేస్తే ప్రభుత్వానికి కోట్ల రూపాయలు మిగిలిపోనున్నాయి.

సాగుకు యోగ్యంగా లేని భూములు 2,501 ఎకరాలు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేయించింది. జిల్లాలో 2,80,151 ఎకరాల భూములకు పాస్‌బుక్‌లు ఉన్నాయి. ఇరుశాఖల అధికారులు సర్వేలు చేసి జిల్లా వ్యాప్తంగా 2,77,650 ఎకరాలు సాగుకు యోగ్యమైనవిగా, 2,501 ఎకరాలు సాగుకు యోగ్యంగా లేనట్లు గుర్తించారు. నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.5వేలు చెల్లించగా ప్రస్తుత ప్రభుత్వం ఎకరాకు రూ. 6వేలు చెల్లిస్తోంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.140,07,45,389 నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో సాగుకు యోగ్యంగా లేని భూములకు రైతు భరోసా నిలిచిపోనుంది.

మండలాల వారీగా భూములు (ఎకరాల్లో), రైతు భరోసా వివరాలు..

మండలం	పాస్‌బుక్‌లు ఉన్న భూములు	సాగులో లేని భూములు	రైతు భరోసా (రూపాయల్లో)
చెన్నారావుపేట	18,651	20.53	9,32,53,062
దుగ్గొండి	22,284	89.25	1,11,41,7855
గీసుకొండ	22,007	351	1,10,032,901
ఖానాపురం	14,904	6.29	7,45,20,131
ఖిలా వరంగల్	8,011	545.34	4,0054,797
నల్లబెల్లి	24,349	40.17	12,17,43,348
నర్సంపేట	16,689	60.32	8,34,44,945
నెక్కొండ	25,823	276.05	12,91,12,587
పర్వతగిరి	27,985	87.13	13,99,25,960
రాయపర్తి	41,148	103.25	20,57,38,414
సంగెం	26,152	491.33	13,07,61,638
వరంగల్	3,025	329.33	1,51,26,976
వర్ధన్నపేట	29,123	96.06	14,56,12,775
మొత్తం	2,80,151	2,501.16	140,07,45,389

ప్రభుత్వానికి నివేదించాం..



ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలతో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే పూర్తిచేశాం. సర్వేలో సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాం. యోగ్యంగా లేని భూములకు రైతుభరోసా నిలిచిపోతుంది.

- అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి

ఎస్సైకి గ్రూప్-2 ఉద్యోగం



ఓరుగంటి అశోక్

నర్సంపేట: ఎస్సై ఉద్యోగం చేస్తూనే గ్రూప్-2 ఉద్యోగానికి ఎంపికయ్యారు చెన్నారావుపేట మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఓరుగంటి అశోక్. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో నాలుగేళ్లుగా రిజర్వ్‌డ్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-2లో బీసీఏ-లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా అశోక్‌కు లింగాపురం జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు క్షీరసాగర్, రవికుమార్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పంటలపై పర్యవేక్షణ ఉండాలి



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ

దుగ్గొండి: పంటలను రైతులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ ఆధ్వర్యంలో లక్ష్మీపురం, దుగ్గొండి, తొగర్రాయి, గిర్నిబావి గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంట క్షేత్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటను ఆశించిన అగ్గితెగులు నివారణకు లీటరు నీటికి ట్రైసైక్లజోల్ 0.6 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. సుడిదోమ నివారణకు లీటరు నీటికి డైఫెంతియోరాన్ 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని, కాండం తొలుచు పురుగుల నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల కార్టాఫ్ హైడ్రాక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ ప్రతినిధి సారంగం, ఏఈఓలు హన్మంతు, విజయ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా 'భారత్ గౌరవ్' స్పెషల్ ట్రైన్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా 'భారత్ గౌరవ్' సప్త జ్యోతిర్లింగ దర్శన స్పెషల్ ట్రైన్ యాత్ర ప్రారంభం కానున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ కిశోర్ గురువారం తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీన ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర విజయవాడలో రాత్రి 9 గంటలకు ప్రారంభమై ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్ మీదుగా ఉజ్జయినికి చేరుతుందన్నారు. ఉజ్జయిని మహాకాళేశ్వర్, ద్వారకా, నాగేశ్వర్, సోమనాథ్, భీమశంకర్, త్రయంబకేశ్వర్, గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగాలను సందర్శన చేస్తారని తెలిపారు. ఏప్రిల్ 18వ తేదీన తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. ఈ యాత్రలో భోజనం, హోటల్ గదులు, సెక్యూరిటీతో కూడిన ప్రయాణం ఉంటుందన్నారు. టికెట్ల ధర నాన్ ఏసీ రూ.20,980, థర్డ్ ఏసీ రూ.33,735, సెకండ్ ఏసి రూ.44,375 ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని తెలుగు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఐఆర్‌సీటీసీటీఓయూఆర్‌ఐఎస్‌ఎం.కం లేదా 928030712, 9281030749 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పేద విద్యార్థి కష్టానికి దక్కిన ఫలితం


రెండు ఉద్యోగాలు సాధించిన పవన్

కురవి: నాన్న చిన్నతనంలోనే చనిపోయాడు.. అమ్మ కూలీ పనులు చేసి కొడుకును చదివించింది. అమ్మ పడిన కష్టాన్ని చిన్నతనం నుంచే చూసిన కొడుకు క్రమశిక్షణతో చదువుకున్నాడు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన రెండు ఉద్యోగాలను ఒకే సారి దక్కించుకుని తల్లి కలను నెరవేర్చడంతోపాటు తాను పడిన కష్టానికి తగిన ఫలితం పొందాడు మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి శివారు బీబీనాయక్‌తండా జీపీ పరిధి భూక్య తండాకు చెందిన భూక్య పవన్. భూక్య పార్వతి, (వెంకన్న, లేట్) కుమారుడు పవన్ గురువారం విడుదలైన ఎస్సెస్సీ, సీజీఎల్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించాడు. ఎస్సెస్సీలో ఎంటీఎస్(మల్టీ టాస్కింగ్ స్టాఫ్), సీజీఎల్‌లో టాక్స్ అసిస్టెంట్(సీబీఐసీ సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ టాక్సెస్ అండ్ కస్టమ్స్) ఉద్యోగాలు వచ్చాయి. పవన్ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బీబీనాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి 10 తరగతి వరకు చింతపల్లి జెడ్పీ హైస్కూల్, ఇంటర్మీడియట్ మహబూబాబాద్ ప్రభుత్వ కాలేజీ, డిగ్రీ మానుకోట నలంద కాలేజీలో చదువుకున్నాడు.

18 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

- ఇద్దరు మహారాష్ట్ర వ్యక్తుల అరెస్ట్

వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద గురువారం మహారాష్ట్రకు చెందిన షేక్ సాధిక్, షేక్ మక్సుద్ వద్ద నుంచి రూ.9లక్షల విలువైన 18కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. రైల్వే స్టేషన్ వద్ద రెండు బ్యాగులతో ఇద్దరు వ్యక్తులు పోలీస్ వాహనాన్ని చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి లభించిందన్నారు. విచారించగా వరంగల్ రైల్వే స్టేషన్‌లో అమ్మడానికి వచ్చినట్లు తెలిపారని, దీంతో వీరిద్దరిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కేయూ విద్యా కళాశాలలో అవకతవకలు

- రూ. 8 లక్షలకు పైగా మాజీ ప్రిన్సిపాల్ చేతివాటం
- గుట్టు రట్టు కావడంతో మళ్లీ అకౌంట్‌లో జమ
- షోకాజ్ నోటీస్ జారీ చేసిన రిజిస్ట్రార్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ విద్యా కళాశాలలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని కొంతకాలంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కళాశాలలో రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందగా ఉన్న ఒక్క రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయలత కొంత కాలం క్రితమే హైదరాబాద్‌లోని ఇఫ్లూ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకమైంది. దీంతో రెండున్నరేళ్ల క్రితం అదే కళాశాలలో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా, బీఓఎస్‌గా రెండు బాధ్యతలు అప్పగించారు. దీంతో అందొచ్చిన అవకాశాన్ని ఆసరా చేసుకున్న సదరు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అవకతవకలకు పాల్పడుతున్నారని కొన్నినెలల క్రితమే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో యూనివర్సిటీ అధికారులు ఆయనను ఆ బాధ్యతల నుంచి తొలగించగా ఆయన మళ్లీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో కళాశాలలోని బీఓఎస్ అకౌంట్‌లోని రూ. 8 లక్షలకుపైగా డబ్బును ప్రిన్సిపాల్, బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ హాంఫట్ చేశారనే అంశం యూనివర్సిటీ అధికారుల దృష్టికి వెళ్లింది.

ఆ విద్యా కళాశాలలో ప్రత్యేకంగా బీఓఎస్ అకౌంట్

కేయూ పరిధిలోని ఏ కాలేజీల్లో లేని విధంగా క్యాంపస్‌లోని విద్యా కళాశాలలో ప్రత్యేకంగా బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్(బీఓఎస్) పేర బ్యాంకులో అకౌంట్ తీసి వినియోగిస్తున్నారనే విషయం ఇప్పుడు వెల్లడియింది. ఏ నిధులు జమచేయిస్తున్నారనే విషయంపై స్పష్టత లేకున్నా మొత్తానికి అందులో రూ. 8లక్షలకు పైగా ఉండగా ఆ డబ్బును ప్రిన్సిపాల్‌గా, బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ వినియోగించుకున్నారని తాజాగా వెలుగు చూసింది.

మాజీ ప్రిన్సిపాల్ గుట్టు ఇలా రట్టు..

కేయూలో విద్యా కళాశాలలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను ప్రిన్సిపాల్ బాధ్యతల నుంచి తొలగించాక ప్రొఫెసర్ వి. రామచంద్రంను ఆ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా, ఇఫ్లూ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ విజయలతను విద్యా కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా నియమించారు. దీంతో ఆమె ఫిబ్రవరి 1న బీఓఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. బీఓఎస్ అకౌంట్ గురించి ఆమె.. సదరు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను వివరాలు అడగగా తెలియజేసేందుకు జాప్యం చేశారు. దీంతో ఆమె.. వీసీ ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. ఇటీవలే కేయూ సోషల్ సైన్స్‌డీన్ మనోహర్‌ను విద్యాకళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించాక ఆ కళాశాలలోని పలు అవకతవకలపై ఆరాతీసినట్లు సమాచారం. బీఓఎస్ అకౌంట్‌లోని డబ్బులు కూడా అప్పటి బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆ కాంట్రాక్టు ప్రొఫెసర్ వినియోగించుకున్నట్లు గుర్తించారని సమాచారం. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. దీంతో తనపై చర్యలు తీసుకుంటారని భావించిన అవతకవకలకు పాల్పడిన ఆ కాంట్రాక్టు ప్రొఫెసర్ కొద్దిరోజుల క్రితమే తాను బీఓఎస్ అకౌంట్ నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి మళ్లీ కేయూ రిజిస్ట్రార్ ఫండ్ అకౌంట్‌లోకి జమచేశారు. ఈ విషయాన్ని ఇటీవల అధికారుల దృష్టికి తీసుకెళ్లారని తెలుస్తోంది. తనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. బీఓఎస్ అకౌంట్ నిధులు వినియోగించుకోవాలంటే వీసీ అప్రూవల్ మేరకు వ్యయం చేయాల్సింటుంది. సొంతానికి వినియోగించుకోకూడదు. ఇప్పుడు వర్సిటీలో ఇది హాట్‌టాపిక్‌గామారింది.

మాజీ ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్ జారీ

కేయూ విద్యాకళాశాల మాజీ ప్రిన్సిపాల్, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం రెండు రోజుల క్రితం షోకాజ్ నోటీస్ జారీచేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కాగా, సదరు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ వ్యవహారంపై అధికారులు విచారణ కమిటీ వేస్తారా లేదా అతడిపై చర్యలు తీసుకుంటారా అనే అంశం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు రిజిస్ట్రార్ వి. రామచంద్రంను గురువారం 'సాక్షి' వివరణ కోరగా ఆ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ బీఓఎస్ అకౌంట్ రూ. 8.50లక్షలు నుంచి తీసుకున్నారనే విషయం వెలుగు చూసిందన్నారు. రూ. 8.75లక్షలు రిజిస్ట్రార్ ఫండ్ అకౌంట్‌లోకి జమచేశారని తన దృష్టికి వచ్చిందన్నారు. రూ. 25 వేలు వడ్డీ చెల్లించానని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ చెబుతున్నారన్నారు. ఇప్పటికే షోకాజ్ నోటీస్ జారీచేశాం.. అతడు ఇచ్చే వివరణను బట్టి చర్యలు ఉంటాయన్నారు.

టెక్నాలజీతో మార్పులు అనివార్యం

- కేయూ మాజీ వీసీ వెంకటరత్నం


మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ వెంకటరత్నం

కేయూ క్యాంపస్: టెక్నాలజీతో మార్పులు అనివార్యమని, టెక్నాలజీని స్వాగతించినప్పుడే వ్యాపార సంస్థల మనుగడ సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ బి. వెంకటరత్నం అన్నారు. కేయూలోని కామర్స్‌అండ్‌బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో 'న్యూహరిజన్స్ ఇన్‌కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డ్యూరింగ్ 21ఫస్ట్ సెంచరీ చాలెంజెస్ అండ్ ఆపార్చునిటీస్' అనే అంశంపై రెండురోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు గురువారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సభలో వెంకటరత్నం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫైనాన్షియల్ సెక్టార్‌లో మార్పులు చాలా ప్రభావం చూపాయన్నారు. మార్పుతోపాటే వచ్చే అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. అన్ని అడ్డంకులు ఎదుర్కొవాలన్నారు. వ్యాపార నిర్వహణ సులభమైనప్పటికీ విలువలతోకూడిన ఆ వ్యాపార ప్రపంచం అవసరమన్నారు. విద్యార్థులు నైపుణ్యాలపై దృష్టిసారించాలన్నారు. గౌరవ అతిథి కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం మాట్లాడుతూ డిజిటల్ మార్కెటింగ్ విస్తృత అవకాశాలు అందించిందన్నారు. ఇ-కామర్స్ లావాదేవీలు పెరిగాయన్నారు. ఉత్పాదకత, ఉద్యోగిత పెరిగిందన్నారు. వినియోగదారుడు కేంద్రంగా వ్యాపార వ్యవస్థ ఉందన్నారు. సదస్సులో ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి. అమరవేణి, ఆచార్యులు నర్సింహాచారి, పి. వరలక్ష్మి, రాజేందర్, నిరంజన్, శ్రీనివాస్, ఎం. గిరిప్రసాద్ మాట్లాడారు. మోడరేటర్లుగా ఇ. రాజు, సాయిశరణ్, ఎం. కనకయ్య వ్యవహరించారు.

లారీ డ్రైవర్‌కు జరిమానా, జైలు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌కు రూ.వెయ్యి జరిమానాతో పాటు రెండ్రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో ఎస్సై వాహనాలు తనిఖీ చేస్తుండగా వికారాబాద్ జిల్లా పరిగి గ్రామానికి చెందిన ముదావత్ రాజు అతిగా మద్యం సేవించి లారీ నడుపుకుంటూ వస్తుండగా ఆపి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. 287 రీడింగ్ రావడంతో కేసు నమోదు చేసి భూపాలపల్లి కోర్టుకు తరలించారు. గురువారం జడ్జి.. రాజుకు రెండ్రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించి, పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఫేక్ డీడీ గల లారీ పట్టివేత..

మహదేవపూర్ మండలం అన్నారం క్వారీకి ఇసుక లోడ్ కోసం వచ్చిన లారీ నంబర్ టీఎస్ 07 టీ 2888 యజమాని వేరే లారీతో ఫేక్ ఆర్డర్ నంబర్ డీడీ తీసుకొస్తుండగా మహబూబ్‌నగర్‌కు చెందిన మంజలి కురుమన్నను సిబ్బంది తనిఖీ చేసి పట్టుకుని లారీని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గురువారం టీజీఎండీసీ సిబ్బంది ఫిర్యాదు మేరకు లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హోలీ.. ఆనందాల కేళి

రసాయన రంగులు వద్దు..

- సహజసిద్ధ కలర్లే ముద్దు
- నేడు హోలీ పండుగ


హోలీకి వినియోగించే సహజసిద్ధ రంగులు


హోలీకి వినియోగించే మోదుగు పూలు

మహబూబాబాద్ రూరల్: హోలీ పండుగ అంటేనే సప్త వర్ణ శోభితం.. ప్రకృతిలో లభించే వివిధ రకాల చెట్ల పూలనుంచి తయారు చేసిన రంగులను చల్లుకుంటూ వసంత రుతువు ప్రారంభంలో చేసుకునే పండుగ. ఈ పండుగలో వివిధ కృత్రిమ రసాయనిక ఎరువులు వాడడం వల్ల దుష్పలితాలు కలిగే ప్రమాదం ఉంది. అందుకే రసాయన రంగులు పులుముకోకుండా సహజసిద్ధ కలర్లే చల్లుకుని పండగను ఆనందంగా జరుపుకోవాలని అధికారులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

కృత్రిమ రంగు..

నలుపులో లెడ్ ఆక్సైడ్ మూత్ర పిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.

కృత్రిమ ఆకుపచ్చ రంగు..

కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.

వెండి రంగు..

అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్ కారకం.

నీలి రంగు..

పుసియన్‌బ్లూ చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరుపు) క్యాన్సర్‌కు కారణమవుతాయి.

పౌడర్లు, గులాల్..

లెడ్, బ్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్, వినిడికి లోపం, ఎలర్జీ, ఆయసం మొదలగు దుష్పలితాలకు దారితీస్తాయి. ముఖ్యంగా యువత ఈ పండుగను సెలబ్రేట్ చేసుకునే తీరుతో ఆరోగ్యం మరింత దెబ్బతినే అవకాశం ఉంది. ఈ రంగులు చల్లుకుని చెరువులు, కుంటలు, సెలయేర్లలో స్నానాలు చేయడం వల్ల ఈ విషపూరిత రసాయనాలు అందులో కలిసి అనేక జీవజాతులు నాశనం అవుతున్నాయి. రంగులు ఉపయోగించేటప్పుడు జాగ్రత్తతో వ్యవహరించాలి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధుల పట్ల మరీ జాగ్రత్తగా ఉండాలి.

సహజ రంగుల తయారీ ఇలా..

- ఎరుపు రంగు కోసం ప్రకృతిలో లభించే బీట్ రూట్, మొదుగు పూలు, గులాబీ, మందారం వాడాలి.
- పసుపు రంగు కోసం పసుపు, ఆకుపచ్చ రంగు కోసం ఆకుకూరల మిశ్రమం ఇలా సహజ రంగులను వాడడం మనకే కాదు పర్యావరణానికి కూడా మంచిది. ఇవి ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. సహజ రంగుల్లో లభించే యాంటీ యాక్సిడెంట్లు చర్మవ్యాధులను నియంత్రించి, చర్మం మృదువుగా, తేజోవంతంగా తయారవుతుంది.

సహజ సిద్ధ రంగులు వాడాలి



సహజ సిద్ధంగా తయారు చేసిన రంగులనే వాడాలి. ప్రజలు రసాయన రంగులు చల్లడం మానుకుని అనారోగ్యంగా ఉండాలి. హోలీ పండుగను పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా నెహ్రూ సెంటరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– లింగంపల్లి దయానంద్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కల్చరల్ సెక్రటరీ

పర్యావరణాన్ని కాపాడాలి



ప్రకృతిలో లభించే పూలు, ఆకులు, ఇతరత్రా వాటితో తయారయ్యే రంగులను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. పర్యావరణాన్ని కూడా కాపాడిన వారమవుతాం. హోలీ వేడుకల్లో సహజరంగులనే వాడాలి. రసాయన రంగులు కళ్లలో పడితే కంటి చూపు దెబ్బతింటుంది.

– పూరె గురునాథరావు, దిశ సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు

బస్సులో వెళ్లినా బతికేవారేమో!

- టైర్ పగిలి డివైడర్‌ను ఢీకొన్న కారు
- అక్కాచెల్లెలు దుర్మరణం.. ముగ్గురికి స్వల్ప గాయాలు
- ఖానాపురంలో ఘటన


యశోద(ఫైల్)


మాణిక్యమ్మ(ఫైల్)

ఖానాపురం: అమ్మా, పెద్దమ్మా.. బస్సులో వెళ్లినా బతికేవారేమో.. లోపలికి వెళ్తాం.. దేవాలయం వద్ద కారు ఆపమన్నప్పుడు ఆపినా బతికేవారేమో అంటూ మృతదేహాల మీద పడి కుమారులు, కుమార్తె రోదించిన తీరు పలువురిని కంటతడికి గురి చేసింది. టైర్ పగిలి కారు పల్టీకొట్టి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వృద్ధురాళ్లు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రం శివారులో చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. ఖిలావరంగల్‌కు చెందిన ఏసిరెడ్డి యశోద(80), బోలుగొడ్డు మాణిక్యమ్మ(78) అక్కాచెల్లెలు. కుటుంబ సభ్యులతో కలిసి మహబూబాబాద్ జిల్లా కురవిలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన దశదిన కర్మ కార్యానికి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత అక్కాచెల్లెలు బస్సులో వెళ్దామని అనుకున్నారు. ఇదే కార్యానికి వచ్చిన యశోద కుమారుడు రమేశ్ కారులో వెళ్దామని చెప్పాడు. దీంతో యశోద, మాణిక్యమ్మ కుమార్తె అనిత, కుమారుడు హరీశ్‌బాబు, మాణిక్యమ్మ కారులో బయలుదేరారు. కురవిలో దేవాలయం వద్ద ఆగుదామనుకున్నారు. కానీ ఆలస్యమవుతుందనే కారణంతో ఆగకుండా ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో ఖానా పురం మండలం ఐనపల్లి శివారులోని పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే కారు వెనుక టైర్ పగిలింది. దీంతో అదుపుతప్పి దూసుకెళ్లే క్రమంలో మరో టైర్ పగిలి పల్టీకొడుతూ జాతీయరహదారి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న అక్కాచెల్లెలతో పాటు కారు నడుపుతున్న రమేశ్, అనిత, హరీశ్‌బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై రఘుపతి ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో యశోద, మాణిక్యమ్మ మృతిచెందారు. మృతదేహాలను నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, నర్సంపేట రూరల్ సీఐ సా యిరమణ, ఎస్సై రఘుపతి సందర్శించి వివరాలు సేకరించి పోస్టుమార్టం తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. అక్కాచెల్లెలు మృతి చెందడంతో ఖిలావరంగల్‌లో తీవ్ర విషాదం నెలకొంది.

భర్త హత్యకు భార్య సుపారీ..

- ఎలాగైనా, అనుమానం రాకుండా చంపాలని ఒప్పందం
- ప్లాన్ ఫెయిల్.. భార్యతో పాటు నలుగురి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన నర్సంపేట రూరల్ ఎస్సై అరుణ్

నర్సంపేట రూరల్ : భర్తను కడతేర్చడానికి భార్య సుపారీ అందజేసింది. ఎలాగైనా, ఎవరికీ అనుమానం రాకుండా చంపాలని ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఈ ప్లాన్‌ను పోలీసులు భగ్నం చేశారు. ఈ ఘటనలో గురువారం భార్యతోపాటు నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నర్సంపేట రూరల్ ఎస్సై అరుణ్ కథనం ప్రకారం.. నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన ధారావత్ సుమన్‌కు, మహేశ్వరం గ్రామానికి చెందిన మంజులతో 2018 సంవత్సరంలో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కూతురు ఉంది. మూడు సంవత్సరాల నుంచి గొడవలు జరుగుతుండడంతో హైదరాబాద్‌లో వేర్వేరుగా ఉంటున్నారు. సుమన్ హైదరాబాద్‌లోనే ఓ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం నరేశ్ అనే యువకుడు సుమన్‌కు వాట్సాప్ కాల్ చేసి నిన్ను చంపేందుకు ప్రయత్నం జరుగుతుందని, తనకు డబ్బులు ఇస్తే ఆ ప్రయత్నాన్ని ఆపుతానంటూ చెప్పాడు. దీంతో భయాందోళనకు గురైన సుమన్.. ఈనెల 9వ తేదీన నరేశ్‌పై నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నరేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఇందులో సుమన్ భార్య మంజుల.. మరికొందరితో కలిసి భర్తను చంపించేందుకు నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన గోపికి రూ.30వేల సుపారీ ఇచ్చినట్లు నరేశ్ తెలిపాడు. దీంతో మంజుల, ఆమెకు సహకరించిన ఆమె బావ ములుగుకు చెందిన మోతీలాల్, వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన నరేశ్, నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన గోపి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన మల్లేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి


శ్రీనివాస్ మృతదేహం

గార్ల: అతిగా మద్యం సేవించి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం గార్ల సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. ఎస్సై ఎస్‌కె. రియాజ్‌పాషా కథనం ప్రకారం .. ఏపీలోని అంబేడ్కర్ జిల్లాకు చెందిన మాకి శ్రీనివాస్(35) గార్ల మండలం బుద్దారం పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వద్ద కూలీ పనులకు వచ్చాడు. నాలుగు రోజుల నుంచి పనికి వెళ్లకుండా.. భోజనం చేయకుండా నిత్యం మద్యం సేవిస్తున్నాడు. దీంతో నీరసంతో కుప్పకూలాడు. తోటి కూలీలు శ్రీనివాస్‌ను హుటాహుటిన 108లో గార్ల సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి శ్రీనివాస్ అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తమ్ముడు నాగభూషణం ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

భార్యను చంపిన భర్త అరెస్ట్, రిమాండ్

కురవి: భార్యను చంపిన భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మరిపెడ సీఐ రాజ్‌కుమార్ గౌడ్, ఎస్సై నగేశ్ గురువారం తెలిపారు. మాంసం కూర (మటన్) వండలేదనే కారణంతో మంగళవారం రాత్రి సీరోలు మండలంలోని ఉప్పరిగూడెం శివారు బూరుగు చెట్టు తండా జీపీ పరిధిలోని మాంజా తండాకు చెందిన మాలోత్ బాలు తన భార్య కళావతిని కొట్టి చంపాడు. ఈ ఘటనలో బాలును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ, ఎస్సై తెలిపారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలి

- ఓరుగల్లు పీఠకాపరి బిషప్ ఉడుముల బాల
- ముగిసిన ఫాతిమామాత ఉత్సవాలు


పాల్గొన్న ఫాదర్లు, విశ్వాసులు


పూజను సమర్పిస్తున్న ఉడుముల బాల

కాజీపేట రూరల్ : ప్రపంచ శాంతి స్థాపనకు ప్రార్థించాలని ఓరుగల్లు పీఠకాపరి, విశాఖ అగ్రపీఠకాపరి బిషప్ ఉడుముల బాల అన్నారు. ఫాతిమామాత ఉత్సవాల ముగింపులో భాగంగా హనుమకొండ జిల్లా కాజీపేట కేథిడ్రల్ చర్చి ప్రాంగణంలో గురువారం బిషప్ ఉడుముల బాల సమిష్టి దివ్యబలిపూజ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ప్రపంచయుద్ధాన్ని నిలిపివేసింది ఫాతిమామాతేనని, ఆమెను ప్రార్థించి శాంతి స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఆధ్యాత్మికతతో చేసే ప్రార్థన ఎన్నో ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. ఫాదర్ ఆశీర్వాదం దివ్యబలిపూజతో ఉత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన బైబిల్ క్విజ్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేథిడ్రల్ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు బొక్క దయాసాగర్, టామి, అల్లం ప్రకాశ్‌రెడ్డి, ఫాదర్లు కాసుమల్రెడ్డి, జి.అనుకిరణ్, కె.జోసెఫ్, విజయపాల్, తాటికొండ జోసెఫ్, జి.నవీన్, ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొడుకుపెళ్లి కావడం లేదని మనస్తాపంతో..

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

- కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ సమీపంలో ఘటన

కాజీపేట రూరల్ : కొడుకుకు పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో తండ్రి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ సమీపంలో జరిగింది. కాజీపేట జీఆర్పీ కానిస్టేబుల్ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండకు చెందిన మూల రాజు కాజీపేట డీజిల్ షెడ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రాజుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. చిన్న కుమారుడికి, కుమార్తెకు పెళ్లిళ్లు అయ్యాయి. అనారోగ్య కారణంగా పెద్ద కుమారుడికి కావడం లేదు. దీనిపై మనస్తాపం చెందిన రాజు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహానికి ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న కారు..

- వ్యక్తి దుర్మరణం.. భట్టుపల్లిలో ఘటన


శ్రీనివాస్(ఫైల్)

మడికొండ : కారు.. ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాజీపేట మండలం భట్టుపల్లి శివారులో జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలకు చెందిన రాపోలు శ్రీనివాస్ (46)తన భార్య రమాదేవితో కలిసి వరంగల్‌కు వెళ్లి ఆటోలో స్వగ్రామానికి వస్తున్నారు. భట్టుపల్లి మూడుచింతల వద్ద ఆటోను ఆపి కూల్‌డ్రింక్ తాగుతుండగా వరంగల్ నుంచి వస్తున్న కారు.. ఆటోను ఢీకొంది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు ఆపకుండా వెళ్లడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇన్‌స్పెక్టర్ కిషన్ సిబ్బందిని కడిపికొండ, తరాలపల్లి గ్రామాలకు పంపించి వెతికించారు. తరాలపల్లి వద్ద కారు ముందు భాగం ధ్వంసమై ఉండడం గమనించి అందులో ఉన్న దామెర మండలం పులుకుర్తికి చెందిన గుర్రాల దినేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.